క్లుప్తంగా

కన్నబాబుకు సత్కారం



వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ కన్నబాబు, జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్‌లను సత్కరిస్తున్న తూర్పు నేతలు

మద్దిలపాలెం: వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు తొలిసారి మద్దిలపాలెంలోని పార్టీ జిల్లా కార్యాలయాన్ని ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ సమక్షంలో ఆయనను తూర్పు నియోజకవర్గ పరిశీలకుడు, ఏపీఐఐసీ మాజీ డైరెక్టర్ మొల్లి అప్పారావు, జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు, నియోజకవర్గ కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, డైరెక్టర్లు, అనుబంధ విభాగాల నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు గజమాలలతో సత్కరించి స్వాగతం పలికారు.

- రీజినల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబును పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నడింపల్లి కృష్ణంరాజు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. 15వ వార్డు సీనియర్ నాయకులు కణితి మరియదాస్, పెదిరెడ్ల నూకరాజు, కుదిరిల్ల వెంకటరావు పాల్గొన్నారు.

పెదగదిలి శివాలయంలో మేయర్ పూజలు



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

ఏయూక్యాంపస్: పెదగదిలిలోని అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం మేయర్ గొలగాని హరివెంకటకుమారి ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 24న ఆలయ వార్షికోత్సవం నేపథ్యంలో 22 నుంచి 26వ తేదీ వరకు వేడుకలు నిర్వహిస్తున్నారు. తిరువీధి ఉత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. 1001 బిందెలతో స్వామికి అభిషేకం నిర్వహించారు. ఆదివారం ఏర్పాటు చేసిన మహా అన్నదానంలో మేయర్ హరివెంకటకుమారి పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ నెల 26న వేకువజాము నుంచి ప్రత్యేక అభిషేకాలు, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. అంపోలు ఉమామహేశ్వర శర్మ, ఆలయ అర్చకుడు దార్లపూడి లక్ష్మణ శాస్త్రి పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శ్రీకృష్ణా యువజన సంఘం అధ్యక్షుడు కోలా బంగారయ్య, కార్యదర్శి చల్లా రాజు తదితరులు పాల్గొన్నారు.

కొలువుదీరిన వేపచెట్టు పైడితల్లమ్మ



విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న పీతల గోవింద్

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డు శివాజీపాలెంలో వేపచెట్టు పైడితల్లి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ పాల్గొన్ని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన గరిడీ కార్యక్రమానికి ఆర్థిక సాయం అందించారు.

విజేత వాల్తేరు వారియర్స్



క్రికెట్ టోర్నీ విజేతలకు ట్రోఫీ అందిస్తున్న మువ్వల సురేష్

బీచ్‌రోడ్డు: వాల్తేరు జాగ్వర్స్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చినవాల్తేరులోని ఏయూ జూబ్లీ గ్రౌండ్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో వాల్తేరు వారియర్స్ విజేతగా నిలిచింది. 12 టీంలు పాల్గొన్న ఈ టోర్నీలో పోటాపోటీగా పోటీలు సాగాయి. టోర్నీ ముగింపు సందర్భంగా ఆదివారం విజేతలకు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మువ్వల సురేష్, నాయకులు గేదెల నాగరాజు, డి.శ్యామ్ ప్రసాద్‌రెడ్డి ట్రోఫీ, బహుమతులు అందజేశారు.



ఫుట్‌పాత్‌పై వెలిసిన దుకాణాలు



ఫుట్‌పాత్‌పై దుకాణాల ముందు నిలిపిన వాహనాలు

ఫుట్‌పాత్‌లు మాయం

విచ్చలవిడిగా దుకాణాల ఏర్పాటు

పెదవాల్తేరు–చినవాల్తేరు రహదారిలో యథేచ్ఛగా ఆక్రమణ

పాదచారుల అవస్థలు.. ట్రాఫిక్ ఇబ్బందులు

పట్టించుకోని అధికారులు



పెదవాల్తేరు రోడ్డులో ఫుట్‌పాత్‌ను ఆక్రమించి ఏర్పాటు చేసిన శాశ్వత దుకాణాలు

బీచ్‌రోడ్డు:

ఆ ప్రాంతంలో నాలుగు ప్రభుత్వ ఆస్పత్రులు ఉన్నాయి. నిరంతరం ప్రజలు వాటి చుట్టూ తిరుగుతుంటారు. ఈ మార్గంలో పాదచారులు నడిచేందుకు వీలుగా నిర్మించిన ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురై మాయమవుతున్నాయి. ఇక్కడి కాలిబాటలను కొందరు ధనార్జన కోసం ఆక్రమించుకుని శాశ్వత దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో పాదచారులు నడవడానికి.. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నా.. ఆక్రమణదారులను అరికట్టడంలో సంబంధిత అధికారులు విఫలమవుతున్నారు. దీంతో యథేచ్ఛగా కొందరు వ్యాపారులు ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని దుకాణాలు నిర్వహిస్తున్నారు. ఇది జీవీఎంసీ 20వ వార్డు పెదవాల్తేరులో గల ప్రభుత్వ మానసిక, ఆర్‌సీడీ ఆస్పత్రులకు వెళ్లే మార్గంలోని ఫుట్‌పాత్‌ల పరిస్థితి.

కన్నెత్తి చూడని ట్రాఫిక్ పోలీసులు

పెదవాల్తేరు – చినవాల్తేరు రహదారిలో ప్రభుత్వ ఈఎన్టీ, ఛాతీ, మానసిక, ఆర్‌సీడీ జిల్లా ఆస్పత్రులు ఉన్నాయి. ఈ మార్గం నుంచి వీఎంఆర్‌డీఏ పార్క్, బీచ్ సందర్శనకు పెద్ద సంఖ్యలో ప్రజలు వెళ్తుంటారు. దీంతో ఈ మార్గం ఎప్పుడూ వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ప్రస్తుతం ఇక్కడి ఫుట్‌పాత్‌లపై విచ్చలవిడిగా దుకాణాలు వెలుస్తున్నాయి. ఆరు నెలల ముందు వరకు ఈ ప్రాంతంలో కేవలం ఒకటి రెండు దుకాణాలే ఉంటే.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పదుల సంఖ్యలో వాటిని ఏర్పాటు చేశారు. మరిన్ని షాపులు ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ దుకాణాల వద్దకు వచ్చిన వారు రోడ్డుపై తమ వాహనాలు నిలపడం వల్ల ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఈ సమస్యపై ట్రాఫిక్ పోలీసులు తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు స్థానికులు ఆరోపిస్తున్నారు.

శాశ్వత దుకాణాల ఏర్పాటు

పేదలు తమ కుటుంబ పోషణ కోసం చిన్న చిన్న దుకాణాలు ఫుట్‌పాత్‌లపై పెట్టుకోవడం సర్వసాధారణం. ఈ ప్రాంతంలో మాత్రం కాలిబాటలను ఆక్రమించి శాశ్వత దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. కిరాణా, మెకానిక్ షాపులు, టీ కొట్లు, టాక్సీ సర్వీస్ ఆఫీసుల వంటివి పెద్ద మొత్తంలో ఏర్పాటు చేస్తున్నారు. దీంతో అది ఫుట్‌పాత్ లేక వాణిజ్య స్థలామా అనేలా తయారైంది.

సహకరిస్తున్న జీవీఎంసీ అధికారులు

చాలా చోట్ల తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న దుకాణాలనే తొలగించిన జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు ఫుట్‌పాత్‌లపై గల శాశ్వత దుకాణాల తొలగింపునకు ఎందుకు వెనకడుగు వేస్తున్నారో వారికే తెలియాలి. ఎవరైనా **ఫిర్యాదు చేస్తే రెండు మూడు రోజులు** హడావుడి చేసి మళ్లీ **షాపులు ఏర్పాటు చేసుకోనేందు**కు అధికారులు సహకరిస్తు**న్నారే ఆరోపణలు ఉన్నాయి. ఇ**ందుకు జీవీఎంసీ అధికారు**లకు, పలు యూనియన్లకు** పెద్ద మొత్తంలో తాయిలాలు **అందుతున్నట్లు సమాచారం**. సంబంధిత ఉన్నతాధి**కారులు స్పందించి ఫుట్**పాత్‌లు ఆక్రమణకు గురికాకుండా చూడాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

దుకాణాలకు విద్యుత్ కనెక్షన్లు

ఎవరైనా కొత్తగా ఇళ్లు **నిర్మించు**కుంటే విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి చాలా అనుమతులను అడిగే ఏపీఈపీడీసీఎల్ **అధి**కారులు.. ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకొని **దుకా**ణాలను నడుపుతున్న వారికి మాత్రం ఎలా కనెక్షన్లు ఇస్తున్నారనేది అర్థం కావడం **లేదు**. ఫుట్‌పాత్‌లపై నిర్వహిస్తున్న టీ, కిరాణ **షాపు**లు, టిఫెన్ సెంటర్లకు విద్యుత్ కనెక్షన్లు **ఉం**డటం గమనార్హం.

గ్రూప్‌-2 పరీక్షకు 79 మంది గైర్హాజరు



చినవాల్తేరు పరీక్ష కేంద్రం వద్ద డ్రోన్‌తో పర్యవేక్షిస్తున్న పోలీసులు

ఏయూక్యాంపస్: చినవాల్తేరు కోటక్ సెలిషియన్ స్కూల్‌లో ఆదివారం జరిగిన ఏపీపీఎస్సీ గ్రూప్‌–2 మెయిన్స్ పరీక్షకు 79 మంది గైర్హాజరయ్యారు. ఈ కేంద్రంలో 350 మందిని కేటాయించారు. ఉదయం సెషన్‌కు 272 మంది పరీక్షకు హాజరుగా.. 78 మంది రాలేదు. మధ్యాహ్నం సెషన్‌లో 271 మంది హాజరై 79 మంది గైర్హాజరయ్యారు. నాలుగు రోజులుగా పరీక్ష నిర్వహణపై అభ్యర్థులు ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. ఉదయం నుంచి పరీక్ష కేంద్రం వద్ద 50 మీటర్ల వరకు ఇరువైపులా పెద్ద సంఖ్యలో పోలీసులను మోహరించారు. పరీక్ష కేంద్రంలోకి అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే అనుమతించారు. పరీక్ష కేంద్రాల చుట్టూ సాంకేతికతను వినియోగిస్తూ డ్రోన్ కెమెరాలతో నిఘా చేపట్టారు.

మహిళలను ఆకట్టుకునే హై లైఫ్ ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించిన ఆభరణాలు

ఏయూక్యాంపస్: సాగర తీరంలోని నోవాటెల్ హోటల్‌లో ఈ నెల 24, 25 తేదీల్లో హై లైఫ్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నారు. మహిళలు, యువతులను ఆకట్టుకోవడానికి దేశంలోని ప్రముఖ హై ఎండ్ డిజైనర్ దుస్తులు, ఆభరణాలు, గృహాలంకరణ వస్తువులు సేకరించి ఇక్కడ ప్రత్యేకంగా విక్రయించనున్నారు. దేశవ్యాప్తంగా అత్యుత్తమ డిజైనర్ల నుంచి ఎంపిక చేసిన ఫ్యాషన్, డిజైనర్ వస్త్రాలు అందుబాటులో ఉంటాయి. వివాహాలు, పండగలు, ప్రత్యేకమైన సందర్భాల్లో ధరించడానికి అనువైన దుస్తులు, లెహంగాలు, బ్యాగులు, చర్మసంరక్షణ ఉత్పత్తులు, కార్పెట్‌లు, విలువైన రాళ్ల ఆభరణాలు, ఫర్నిచర్, కేశ సౌందర్య ఉత్పత్తులు, డిజైనర్ సూట్లు, చేతితో తయారు చేసిన సబ్బులు, సుగంధ వస్తువులు, కుడ్య చిత్రాలు వంటివి అందుబాటులో ఉంచుతున్నారు.

ఉన్నత శిఖరాలే యువత లక్ష్యం





వాకథాన్‌లో పాల్గొన్న పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, విద్యార్థులు

ఏయూక్యాంపస్: ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా యువత కృషి చేయాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పిలుపునిచ్చారు. డివైన్ టచ్ స్కూల్ ఆధ్వర్యంలో ఆదివారం పిల్లల కోసం నిర్వహించిన వాకథాన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవితంలో గొప్ప విజయాలను సాధించడానికి వేకువజామునే మేల్కొనడం, వ్యాయామం చేయడం ఎంతగానో దోహదపడతాయన్నారు. చిన్నతనం నుంచి క్రమశిక్షణ, మంచి అలవాట్లను కలిగి ఉండాలని సూచించారు. మన ప్రవర్తన భవిష్యత్ జీవితాన్ని ఎంతగానో ప్రభావితం చేస్తుందన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నితాయి సేవినీ మాతాజీ మాట్లాడుతూ కృతజ్ఞతా వాక్‌గా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. పిల్లలకు మానసిక ఉల్లాసాన్ని కలిగించే ఆహ్లాదకర వాతావరణాన్ని పరిచయం చేశామన్నారు. ఉదయాన్నే ప్రశాంత వాతావరణం, బంగారు రంగు ఇసుక తిన్నెలు వంటివన్నీ శ్రీకృష్ణుడు మన కోసం సృష్టించినవే నన్నారు. శ్రీకృష్ణుడికి కృతజ్ఞతా భావం ప్రతీ వ్యక్తి అలవరచుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కాళీమాత ఆలయం నుంచి సబ్‌మెరైన్ వరకు ఈ నడక సాగింది.

వీసీల నియామకాల్లో గీత కులాలకు ప్రాధాన్యమివ్వాలి



మాట్లాడుతున్న ఆచార్య వివేకానందమూర్తి

ఎంవీపీకాలనీ: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల వీసీల నియామకంతోపాటు నామినేటెడ్ పదవుల్లో గీత కులాలకు ప్రాధాన్యం కల్పించాలని విశాఖపట్నం శెట్టిబలిజ సంఘం డిమాండ్ చేసింది. సంఘ అధ్యక్షుడు గుత్తుల మధుసూదనరావు అధ్యక్షతను నాయకులు ఆదివారం ఎంవీపీ కాలనీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు ఆచార్య వివేకానందమూర్తి, రేఖల కృష్ణగౌడ్, గుత్తుల వెంకటేశ్వరరావు, సంతోష్ తదితరులు మాట్లాడుతూ ఇటీవల జరిగిన విశ్వవిద్యాలయాల వీసీల నియామకంలో గీత కులాలకు ఎలాంటి ప్రాధాన్యం దక్కలేదన్నారు. మరిన్ని వర్సిటీలకు వీసీలను నియమించాల్సి ఉన్న నేపథ్యంలో ఆయా కులాల్లోని అనుభవజ్ఞులు, విద్యావంతులైన ఆచార్యులకు ప్రాధాన్యమివ్వాలని కోరారు. రాష్ట్రంలో ప్రధాన ఓటు బ్యాంకుగా ఉన్న బీసీ గీత కులాల వారికి నామినేటెడ్ పదవుల్లో కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం కల్పించాలన్నారు. ఎన్నికల్లో హామీలు ఇచ్చినప్పటికీ ఆ దిశగా నేటికీ చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. సంఘ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన ‘శ్రీమహాగణపతి యజ్ఞం’



ప్రవచిస్తున్న షణ్ముఖశర్మ

ఎంవీపీకాలనీ: ఈ నెల 15 నుంచి జరుగుతున్న ‘శ్రీమహాగణపతికి లక్ష మోదక యజ్ఞం’ ప్రవచనాల కార్యక్రమం ఆదివారంతో ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా శ్రీ మహాగణపతి వైభవంపై బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ ఆధ్యాత్మిక ప్రవచనాలు అందించారు. రుషి పీఠం సత్సంగం శాఖ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ సెక్టార్‌–6లోని భద్రం పార్క్ వేదికగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ముగింపు సందర్భంగా షణ్ముఖశర్మ మాట్లాడుతూ దేహంలోని జీవుడి చైతన్యమే అనంత విశ్వమంతా వ్యాపించిన పరతత్వ స్వరూపం మహాగణపతేనన్నారు. సర్వ విద్యాప్రదాత గణపతిని ధ్యానించినా.. ఆరాధించినా సర్వశుభాలను అందిస్తారన్నారు. అంతరంగ దర్శనంతో మాత్రమే ఆధ్యాత్మిక చైతన్యం సిద్ధిస్తుందని చెప్పారు. అనంతరం మహాగణపతి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఎక్కిరాల కృష్ణమాచార్య, సద్గురు శివానందమూర్తి, అప్పలాచార్య వంటి మహనీయులు నడిచిన నేల విశాఖలో తాను ప్రవచనాలు చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆయనను నిర్వాహకులు, ఆధ్యాత్మిక వేత్తలు ఘనంగా సత్కరించారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కార్యక్రమంలో నిర్వాహకులు కె.వి.ఎస్.శ్యామ్, కందాళ అరుణ గాయత్రి, డి.శ్రీనివాస్, వి.వి.ఆదినారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే ధ్యేయం



దంత వైద్య ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఆచార్య సోమరాజు

ఏయూక్యాంపస్: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే గాయత్రి విద్యా పరిషత్ లక్ష్యమని సంస్థ కార్యదర్శి ఆచార్య పి.సోమరాజు తెలిపారు. పెదవాల్తేరులోని ప్యాలస్ లేఅవుట్‌లో గల గాయత్రి విద్యా పరిషత్ ఆస్పత్రి నగర కేంద్రంలో ఆదివారం దంత వైద్య ఆస్పత్రిని ప్రారంభించారు. ప్రజలందరికీ ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ నగర ప్రజలకు నామమాత్రం రుసుముతో వైద్య సేవలు అందిస్తామని చెప్పారు. గాయత్రి విద్యా సంస్థల ఉపాధ్యక్షుడు ఆచార్య డి.దక్షిణామూర్తి మాట్లాడుతూ నగర వాసులకు ఉచితంగా వైద్య సేవలు, పరీక్షలు అందించేలా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ సంయుక్త కార్యదర్శి ఆచార్య పి.రాజగణపతి, సౌభాగ్యమ్మ నిర్మల చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు ఆచార్య విజయరత్నం, ఆచార్య లీలావతి వైద్య కేంద్రం నిర్వాహకులు డాక్టర్ పద్మినీదేవి, గాయత్రి మెడికల్ కళాశాల డీన్ డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ మురళీకృష్ణ, రోటరీ పోర్ట్ సిటీ అధ్యక్షుడు డాక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జైటో క్రికెట్ పోటీలు



ట్రోఫీలను ప్రదర్శిస్తున్న ఆయా జట్ల కెప్టెన్లు, నిర్వాహకులు

ఎంవీపీకాలనీ: జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్(జైటో) క్రికెట్ పోటీలు నగరంలో ఉత్సాహంగా జరిగాయి. జైటో విశాఖ చాప్టర్ పర్యవేక్షణలో ఆదివారం లాసన్స్ బే కాలనీలోని మైదానంలో ఈ పోటీలు నిర్వహించారు. మహిళ, పురుషులతో కూడిన క్రీడా జట్లను ప్రోత్సహించడంతోపాటు నిరాశ్రయులు, పేదరికం కారణంగా విద్యకు దూరమైన చిన్నారులు, తల్లిదండ్రుల సంరక్షణ లేని వారి సహాయార్థం నిధుల సేకరణే లక్ష్యంగా కొన్నేళ్లుగా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి గౌతమ్ తెలిపారు. ఈ ఏడాది విశాఖలో జరిగే పోటీలకు నేచర్‌వ్యాలీ ఆధ్వర్యంలో సియారామ్స్ సంస్థ ప్రధాన స్పాన్సర్‌గా వ్యవహరించిందన్నారు. శని, ఆదివారం జరిగిన ఈ పోటీల్లో చెన్నై, హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం వంటి మెట్రో నగరాలకు చెందిన 13 జట్లు పాల్గొన్నాయని చెప్పారు. వీటిలో మహిళల జట్లు 5, పురుషుల జట్లు 8 ఉన్నాయన్నారు. పురుషుల జట్లకు ఫారస్, గౌతమ్, నికేష్‌లు, మహిళ జట్లకు ప్రమీలా, ప్రియాంక, వేణి నిర్వాహకులుగా వ్యవహరించారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించండి




కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మను కలిసిన లగుడు గోవిందరావు

ఏయూక్యాంపస్: ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఏర్పాటైన విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు పూర్తి స్థాయిలో కృషి చేయాలని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మను ఉత్తరాంధ్ర పరిరక్షణ సమితి అధ్యక్షుడు లగుడు గోవిందరావు కోరారు. ఆదివారం విశాఖలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి స్టీల్‌ప్లాంట్‌కు ఆర్థిక ప్యాకేజీ ఇవ్వడంపై కృతజ్ఞతలు తెలిపారు. విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ఏర్పాటు చేయడం స్వాగతిస్తున్నామని, అదే సమయంలో కేకే లైన్‌తో కూడిన పూర్తిస్థాయిలో దక్షిణకోస్తా రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సమితి నాయకులు పెదిరెడ్ల సత్యం, చల్లా సురేష్, పెదిరెడ్ల శ్రీనివాస్, రెడ్డి ఈశ్వరరావు, వరుదు రాజ్‌కుమార్, బర్ల పైడం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

బీచ్‌రోడ్డు: మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతి అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. పాతరేసవానిపాలెంలో నివసిస్తున్న దుర్గాప్రసాద్‌రావు కుమార్తె కె.ప్రసన్న శనివారం సాయంత్రం ట్యూషన్ నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. ప్రతి రోజు రాత్రి 8.30 గంటలకే ఇంటికి వచ్చే ప్రసన్న.. 9 గంటలైనా రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికారు. ఆచూకీ తెలియక పోవడంతో ఆదివారం త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విశ్వంతో విడదీయరాని బంధం



పుస్తకం ఆవిష్కరిస్తున్న రాధాకృష్ణ

సీతంపేట: విశ్వ నియమాలను అవగాహన చేసుకోవడం ద్వారా ప్రజలు స్వేచ్ఛను అనుభవిస్తారని భారత హేతువాద సంఘం ప్రధాన కార్యదర్శి మేడూరి సత్యనారాయణ అన్నారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల ప్రాంతీయ హేతువాద సంఘం మహాసభ ఆదివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విశ్వతత్వం, పరిణామం అంశంపై ప్రసంగించారు. విశ్వం ఆది అంతాలు లేనిదని, మానవుడు విశ్వంలో విడదీయలేని అంతర్భాగమన్నారు. మనుషులు మతాలు, కులాలు, జాతులు, వర్గాల నుంచి బయటకు వచ్చి హేతుబద్ధంగా ఆలోచించాలన్నారు. పరస్పర సహకారంతో మానవాభివృద్ధి సాధ్యమన్నారు. వైజ్ఞానిక వికాసం పెరగాలని సూచించారు. గుమ్మా వీరన్న రచించిన ‘హేతువాద మానవవాద తత్వవేత్త రావుపూడి వెంకటాద్రి’ పుస్తకాన్ని రాడికల్ హ్యూమనిస్ట్ సెంటర్ కోశాధికారి నల్లమోతు రాధాకృష్ణ ఆవిష్కరించి సమీక్షించారు. అనంతరం ఆర్.జగపతి రాజును సంఘం నూతన అధ్యక్షునిగా, ఎన్.పాండురంగారావును ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కాజి రాజశేఖర్, రాంప్రభు, షేక్ దరియావలి తదితరులు పాల్గొన్నారు.